# రెండు కోతులు

"ఇది అడివిని ఇడిసిపెట్టినా అడివి గుణాలను ఇడువలేదు" కోతిని చూస్తూ యాష్టగా అన్నడు గోవిందు. కోతి మగది. ఈడు మీదుంది. తిక్కమీదుంది.

"మనుషులం... సగం ఈడు తిరిగినా మనమే మిడిసిపడుతున్నం...నోరు లేని పసి. దాని కాలమొచ్చినప్పుడు అది కొట్టుకోదా..." మొగన్ని గుర్రుగా చూసి అన్నది బాల. ఆమె కోపంతో మసులుతుంది.

పెండ్లాం మాటలు ఇనీ ఇననట్టు గానే " ఈ చిత్తకార్తిల దీనితో ఏగుడుకష్టమేనే... అయితే మనం ఉపాసమన్న ఉండాలె. కాదంటే దీనికి జంట నన్న కట్టాలె" అన్నాడు. డేరా బట్టను దించుతూ.

బాల డేరా నీడలో పొయ్యి రాళ్ళను పెడుతోంది. చీకటి పడకముందే నూకల గంజి కాయాలనే తొందరలో ఉంది. పక్కనే బిడ్డ రూప ఉంది. డేరాలకు పాతిన బొడ్డు శీలలను సుత్తెతో దిగగొడుతోంది.

పక్కనే ఉన్న చెట్టు నీడలో కోతి ఉంది. మెడకు కట్టిన గొలుసును ముందటి కాళ్లతో ఎత్తి పట్టుకుని చెట్టు మొదలును ఎక్కుతూ దిగుతంది. సుత్తి దెబ్బ పడ్డప్పుడల్లా రూపను చూస్తంది. చూసి చూసి ఎక్కిరిత్తంది. రూప గూడా వయసు మీదుంది.

● పెద్దింటి అశోక్ కుమార్ ●

డేరా చుట్టూ బట్టను సదిరిండు గోవిందు. సైకిలు మీదున్న సామాన్లను ఒక్కొక్కటిడేరాలో సదురుతుండు. బాల అగ్గి రాజేసినట్టుంది. పొగ గుప్పున లేసింది.

కోతి వికారంగా చూస్తంది. చెట్టు మొదలును అలుముకుంటుంది. ఎక్కడెక్కడో తడుముకుంటుంది. దానికి ఏం కావాలో తన కదలికలతోనే చెబుతోంది. తిక్కతిక్కగా ఎగురుతోంది. కోతి వైపు ఓరకంటితో చూస్తూ పై పంటితో కింద పెదవిని కొరికి పట్టి అవుసరం లేకపోయినా బలంగా సుత్తితో కొడుతుంది రూప. ఏదో యాదికచ్చి కంటి రెప్పలు బరువుగా వాలిపోయినయి. మనసులో ఎంకటేశు మెదిలిండు.

పండ్లు బిగబట్టుకుంటూ 'వాని ఆడిగుట్ల... తలపండు వలుగ' అని తిట్టుకుంది. గోవిందు ఆదరా బాదరా సామాన్లను డేరాలో ఏసి సైకిలిని మలిపిండు. కోతి సైకిలును చూసింది. కిసకిసమంది. రెండు సార్లు గెంతింది. 'ఎడ్డోనికి దేనిమీద లోకమంటే తెడ్డుమీదనే' అన్నట్టు ఇకారంగా గోక్కుంటూ నలుసుకుంటూ కూసుంది.

కోతి అరుపును సైకిలు సప్పుడును ఒక్కసారే విన్నది బాల. వేగంగా పోతున్న మొగని దిక్కు ఒక్కసారి చూసి "దొరికింది దొరికినట్టు కల్లు దుకానంల పెట్టకు..." అని గొంతు తగ్గించి, "నీ తలపండు వలుగ రాంగ రాంగనే పది రూపాయాలు మాయం జేత్తివి. కొత్త ఊరుగదా. ఏ యాల్ల ఎట్లుంటదోనని కొంగుకు గట్టుకున్న... యానంగ చూసెనో... ఎప్పుడు విడిసెనో... దబదబ ముందు నడుత్తుంటే తావు జూత్తడే ఏమో అనుకున్న.. వీని తావుల మన్నువడ. కల్లు దుకాణంల జొచ్చె" అన్నది. ఆమె మాటల్లో మొగడు తాగిండని కాదు... తనకు పొయ్యలేదనే కోపం ఉంది.

వద్దనుకుంటనే కోతిని చూసింది రూప. తల్లి తనని చూస్తుందా అని తిరిగి చూసి మళ్ళీ కోతిని చూసింది. పెయ్యంతా ఏదో బరువు. సుత్తెను కింద దించి మట్టిబెడ్డను కోతి మీదికి ఇసిరింది. అది తలుగరాని జాగల తగిలింది. కోతి కీసుమంది. చెంగున ఎగిరింది. రూప కిసకిస నవ్వుకుంది.

నవ్వుకుంటనే తల్లి దిక్కు తిరిగి 'అవ్వా కొంగు ముడి ఇదువంగ సూడలేదాయె" అన్నది. తల్లి పదినోటును ఎంత జాగర్తగా కాపాడిందో తెలుసు. తను దాచి పెడుతానన్నా 'ఎగ్గెలి ముండ యాడనో పడేత్తవు" అని ఇయ్యలేదు.

"లంగకు పది తొవ్వలు... సర్దారుకు ఒక్కటే తొవ్వ. కలిసి అడుగులేత్తుంటే 'నా మొగనికి యాద పేమ పుట్టుకొచ్చెనో' అనుకుంటి... ఎప్పుడు ఇడిసెనో ఎప్పుడు మతుపరిచ్చెనో ... ఐదు సీసలు బోర్లేసే దాకా తెలువకపోయె" అంటూ కిసకిసమంటున్న కోతి దిక్కు చూసింది బాల.

రూప కొట్టిన దెబ్బకు కోతి ఇంకా ఎగురుతనే ఉంది.

"అవ్వా... యాటా చిత్తకార్తిల నాయిన కోతిని కొండపొరం తీసుక పోతుండెగదా! ఈ సారి తీసుకుపోతలేడు...?" అడిగింది రూప అడిగినంక మొగడు యాదికొచ్చి 'ఎందుకో అడిగితి' అనుకుంది.

బాల బుస్సుమంది. 'అడ నీ మిండెడున్నడని పోతలేడు. ముండనా సమితి... ఇచ్చుకం పుచ్చుకం అన్ని నీకేగావాలే...అట్లపోయి సందెదు కట్టెలు ఏరుకరాపో.." అన్నది గెదుముతూ.

రూప మూతి ముడిచింది. వచ్చి కోతి ముందట కూసుంది. దాని గొలుసు ఇప్పింది. కొబ్బరి చిప్పను కోతి మీదకి ఇసిరింది. ఆట నేర్చిన కోతి. చిప్పను ఒడుపుగా అందుకొని నెత్తి మీద పెట్టుకుంది.

కట్టెతో సైగ చేస్తూ "నీ మొగనికి సద్ది తీసుకుపో" అన్నది రూప.

కోతి కొబ్బరి చిప్పను నాలెకు ఇసిరికొట్టింది.

రూప సైగలను మార్చి "అయితే నీ మిండెనికి సద్ది తీసుకుపో" అన్నది.

కోతి కొబ్బరిచిప్పను అందుకుని ముందుకు ఉరకాలె. కాని కోతి కదులనేలేదు. సైగలను గమనించనట్టు తన లోకంలో తనున్నది. ఇంతకు ముందయితే ఒక్క మాటతోనే మెదులుకునేది. ఇప్పుడు కొట్టినా వినరానట్టె ఉన్నది.

"ఓ ముండా.... దానికి కావురమచ్చింది. అది ఇంటలేదు. నీకు కావురమచ్చింది. నువ్వు ఇంటలెవ్వు. చెప్పుతే చెవ్వు మీద పేను పాడుతలేదాయె...కట్టెలు తెమ్మంటే కూసున్నవు. ఎవలు వండిపెట్టన్నే ఇద్దరికి..." గదురాయించింది బాల. బిడ్డమీదికి మండుతున్న కొర్రాయిని లేపింది.

ఉల్కిపడి భయంగా లేచింది రూప. సాలీసాలని కొంగును భుజాల మీది నుంచి గుంజి బొడ్లో చెక్కుకుని వాగులకు దిగింది. అర్ధగంటలో మోపెడు కట్టెల్ని ఏరి కట్టగట్టింది. అటు తిరిగి ఇటు తిరిగి పొద్దుగూక కట్టెలమోపుతో

దేరా దగ్గరికి వచ్చింది. దేరా ముంటద తల్లి తండ్రి కూసున్నరు. ముందట నాలుగు కల్లుసీసలున్నయి. అప్పటికే రెండు ఖాళీ అయినయి. కంజు పిట్టలను కాల్చిన వాసన గుప్పుమంటుంది. రూపకు నోట్లె నీళ్ళూరినయి.

"ఎప్పుడు పోయినవు... ఎప్పుడచ్చినవు, యాడ పన్నవే ఇంతసేపు..." గయ్యిమంది బాల. రూప నోరు తెరువలేదు. ఇప్పుడు నోరుతెరిత్తే ఏం జరుగుతుందో తెలుసు. అక్కడే... కట్టెల మోపు దగ్గరనే ముడుచుకుని కూసుంది.

"అది ఎటుపోతదే... కట్టెలే ఏరుకచ్చె. ఎందుకట్ల అంటవు. దాని బతుకేదో అది బతుకుతది. మొగనితోని పంపుదామంటే వాడు సంపుతడంటవు. బిడ్డని ఉంచడంటవు. ఎంబడుంటే సూటిపోటి మాటలంటవు" కల్లు తాగిన నిషామీద అన్నడు గోవిందు.

బాల ఇంతెత్తులేచింది. రూపకు మూడేండ్ల కింద సచ్చిపోయిన తల్లి యాదికచ్చింది. రూప ఖాళీ కడుపుతోనే నిద్రపోయింది. నిద్రలేచేసరికి తెల్లారింది. తండ్రి ఆటకు సామాన్లు సదురుతుండు. తల్లి గెదుముతుంది. మొఖం మీద నీళ్ల చల్లుకుని రూప కోతిని అందుకుంది.

"వద్దు బిడ్డా... అది ఆడది. అది సైరకు రావాలంటే చిత్తకార్తి దాటాలె" రూపతో అన్నడు గోవిందు.

"ఆడకపోని నాయినా...మనతో ఉంటది. ఇక్కడుండే కుక్కలు సుట్టుకుంటయి" అన్నది.

ఎలితె బొంగులు, పగ్గాలు, రింగులతో గోవిందు ముందు. మద్దెల దప్పుతో బాల నడుమ. కోతితో రూప ఎనుక. ముగ్గురూ నడక సాగింద్రు. ఇంతకు ముందు కుక్కలుండేవి. వాటికెవరు తిండి పెట్టాలని బాల అమ్ముకుంది.

రూపకు ఆకలితో పేగులు గుర్రుమంటున్నయి. ప్రాణం సొలుగుతుంది. ఆటలో చక్రాసనం ఎయ్యాలె. చేతుల మీద నడువాలె. పల్టీలు గొట్టాలె. బలాన్ని కూడదీసుకుని నడుత్తుంది. కోతి రానని మొరాయిస్తంది. సతాయిస్తంది. మనసులో ఉన్న కోరికను వికారపు శాప్టలతో చెబుతంది. కోతిని సముదాయిస్తూ నడిపిస్తంది రూప.

"ఊళ్ళె నాలుగైదు బళ్ళున్నాయి. పిల్లలు గూడా బాగనే ఉన్నరు. కోతి మంచిగుంటే ఆడితే మస్తు పైసలలొచ్చు. పోయినసారి ఆడితే ఎన్ని పైసలచ్చినయి. సూదు సూదుమంట ఇప్పుడే అది ఎదునకచ్చె" గోవిందు అన్నడు.

"కోతి ఎదునకత్తే పోరికేమయింది...? పోరి ఆడదా" వెనక నడుత్తున్న బాల అన్నది.

"పొల్ల ఆటను కబీరు కాడనో, గాంది కాడనో అయితే సూత్తరు. బడిపిల్లలు సూత్తరా... వాళ్లు కోతినే సూత్తరు"

ఇద్దరి మాటలు వింటూ నడుత్తంది రూప. తనను కోతితో సమానం చేసి మాట్లాడుడు రూపకు నచ్చలేదు.

"ఏదో ఉపాయం జెయ్యాలె... లేకపోతే నెల రెండు నెలలు ఎట్ల గడుత్తయి. ఇంక ఆడికోతులు ఎక్కడనన్న ఉంటే సూడాలె. మొగ కోతులతోని ఇదే గోస. ఎదునకొత్తే ఆగయి. పిచ్చిపిచ్చిజేత్తయి. నేను ఆనాడే అన్న మొగకోతి వద్దు ఆడికోతిని పట్టుకుందామని అయ్యా బిడ్డలు సాగనిచ్చింద్రా! బాలెంతప్పుడు ఆట ఆడదంటిరి. ఇప్పుడు జూడు. దీనికి మదన జరమే వచ్చిందనుకో...సచ్చుడు మాత్రం ఖాయం" బాల అన్నది.

"ఇంతమంచిగ ఆట నేర్పిన కోతిని ఎట్ల సంపుకుంటం...ఇసొంటి కోతి కావాలంటే వెయ్యి రెండు వెయిలైనా గావాలె. ఏం లేదు... ఒక ఆడికోతిని పట్టుకచ్చి మెలితం జేద్దాం" అన్నడు.

ఊర్లె ఆటాడి పగటియాల్లకు దేరాకు వచ్చింద్రు. కోతి, రూప ఇద్దరు ఆడితే పైసలు బాగానే రాలేవి. అప్పటికైనా రెండు రోజులు గాసం దొరికింది. రూపకు మాత్రం పాణం కూని కూని అయింది. దప్పుగొట్టి అయ్యా, వంతపాడి అవ్వ మంచిగనే ఉన్నరు.

బాల పగటి కల్లుదాగి గుర్రుకొడుతంది. గోవిందు పిట్టల షికారు పోయిండు. కోతిని చూడలేక వల అందుకుంది రూప. జోర సంచి నైలాన్ తాడును భుజం మీద ఏసుకుంది. గొలుసు ఇప్పి కోతిని భుజం మీద ఎక్కించుకుంది.

నాలుగడుగులు నడిచిందో లేదో దేరాలనుంచి కేక "ఎటు వోతున్నవే... ఎవడు రమ్మన్నడు... పట్టపగలు ఎగేసుక పోతున్నవు" కల్లు నిమ్మిమీదుంది బాల. మాటలు ముద్ద ముద్దగున్నయి.

సంచిని వలను చూపించి, "ఇగేంది... కోతిని పట్టుకత్త... లేకుంటే ఇది బతుకది" అన్నది కోపంగా.

"ఆ... కోతినే పట్టుకురా... దగ్గెరుందని కొండపొరం బొయ్యేవు... పాణాన బతుకవు. నిన్ను పగ్గాల మీద ఆపుదుంది" అనుకుంట నిద్రకు జారుకుంది.

అవి అలవాటయిన మాటలే. దులుపరిచ్చుకుని ముందుకు నడిచింది రూప. పెండ్లయి రెండేండ్లు దాటింది. ఆరు నెలలే అత్తగారింట్ల ఉంది. మధ్యల

కొట్లాట. తల్లి అడ్డం తిరిగింది. బిడ్డను తోలనంది. వెంకటేశు రెండు మూడు సార్లు వచ్చిండు. బాల గోవిందును ఎగేసింది. గోవిందు వెంకటేశును కొట్టిండు. ఏడాది కింద పంచాది. పెద్ద మనుషులకు కల్లు పోసి కాయిదాలు రాసుకున్నరు. ఎవల సామాన్లు వాళ్ల తీసుకున్నరు. అత్తగారు పెట్టిన ముక్కుపుల్ల ఇయ్యనంది రూప. అయితే ఎండికడెం ఇయ్యనన్నడు వెంకటేశు. చెల్లుకు చెల్లయింది. ఇద్దరు విడిపోయింర్రు.

కోతుల జాడ రూపకు తెలుసు. చిత్త కార్తెల అవి ఎత్తయిన చింత చెట్ల మీద ఎందుకుంటయో కూడా తెలుసు. వెంట ఒకటి రెండు కుక్కలుంటే కోతిని పట్టుడు తేలిక. కుక్కలు లేకనే చింత చెట్టు కోసం వెదుకుతుంది రూప.

రెండు మూడు చింత చెట్లు వట్టిగా కనిపించినా బాయి పక్కనున్న ఒక చింత మాత్రం నిండుగా కనిపించింది. నీటి దాపునున్న చింత మీద కోతుల మంద ఉంటదని తెలుసు రూపకు. చెట్టు కిందికి వచ్చి ఆగింది. భుజం మీదున్న కోతిని కిందికి దింపింది. చేతులున్న వలను సంచిని తాడును కిందపడేసింది.

అప్పటికే పొదల నడుమ వల కట్టి వుంది. కుందేళ్లకో పిట్టలకో కాక కోతుల కోసమే కట్టినట్టుగా ఉంది. చిత్రంగా చుట్టూ చూసి చెట్టెక్కింది రూప. చెట్టు మీద కోతులున్నట్టు మదుగు వాసన కొట్టింది. కొనమండలు ఎక్కిచూస్తే, 'జో... జో'' అంటూ ఎవలో కోతుల్ని జోపుతున్నట్టుగా అనిపించింది రూపకు. వెంట కుక్కలు కూడా ఉన్నట్టు అరుపు వినిపించింది. ఇంకో పొద సాటున తన వలను కట్టి మాటేసి కూసుంది రూప.

కొంతసేపటికి కోతులు ఉరికత్తున్నట్టు సప్పుడయింది. వెంట ఉన్న కోతినిదగ్గరకు తీసుకుని కొంగును కప్పింది. అడివి కోతులు ఊరకోతిని ఉత్తగనే పసిగట్టి మందకు మంద మీద పడుతయి.

కుక్కల అరుపు గూడా దగ్గరయింది. అనుకున్నట్టె కోతులమంది వచ్చింది. చెట్టుకు దూరంగా పొదలో కూసుంది రూప. వచ్చిన మంద చెట్టును ఎక్కలేదు. వలల మీద నుంచి దుంకి పోయినయి.

బలంగా... ఎత్తుగా... కుక్కలతో ఎంట వచ్చిన మనిషిని చూసి గుండె దడేలుమంది రూపకు. మెడల పులిగోరు. దండకు తాయితు. అంగి లేదు. పైంటు తొడుక్కుండు. 'కోతుల పీసునె గొడుదు. సూసినావా... చెట్టు ఎక్కలేదు వలల పడలేదు' అనుకుంట వచ్చిండు వెంకటేశు. అతని భుజం మీద ఆడకోతి ఉంది. తన వలను విప్పబోతు పక్కన ఉన్న వలను చూసి ఆగిపోయిండు.

అప్పటికే అతని భుజం మీదున్న ఆడకోతి రూప దగ్గరున్న మొగకోతి ఒకటికొకటి చూసుకున్నయి. వాటిది పాత సోపతే! ఏటా ఎదకు వచ్చే ఈ కాలంలో కలిసి వుండేవే!ఎంకటేశు భుజం మీదున్న ఆడకోతి కిసకిసమని ఒదిగి కూసుంది గానీ రూప దగ్గరున్న మగకోతి ఆగలేదు. తన బాధలన్నింటికి ఉపశమనం దొరికినట్టు గుంజుకుంది. లొల్లి లొల్లి జేసింది. ఎంకటేశును చూసి దాక్కుందామనుకున్న రూపను పట్టి ఇచ్చింది. మొరగబోతూ రూపను చూసి కుక్కలు తోక ఊపినయి.

ఎంకటేశుకు గూడా గుండె దడుక్కుమంది. రూపను చిత్రంగా చూసిండు. తను చూసింది నిజమా కాదా అన్నట్టు చూసిండు. ఆ చూపులకు రూప వణికిపోయింది. పిక్కలపైకి ముడిచిన గోసిని ఇడిసింది. బిర్రెక్కినకొంగును వదులు చేసింది. భుజాలు ఇరిసి రైక బిగిని తగ్గించింది. ఇద్దరూ పట్టు తప్పారు.

అదే సందుగా కోతులు రెండూ దుంకి చెట్టెక్కినయి. తాళ్లు చేతులల్లనే ఉన్నయి. కోతులు మాత్రం కొమ్మ మీదున్నయి.

ఆడకోతి మగకోతిని కోపంగా చూసింది. మొగకోతి కిసకిసమని దగ్గరికి జరిగింది. రెండూ ఎద మీదనే ఉన్నయి. ఉన్నాలేనట్టు ఆడకోతి ఉంది. ఆబగా మొగకోతి ఉంది. ఆడకోతి మగకోతిని గీరింది.గిల్లింది. కొరికింది. దూరం దూరంగా జరిగింది. మగకోతి ఓపిగ్గా గాయపడి పక్కనే కూసుంది. కిసకిసమని రెండూ కొంతసేపు గీసులాడుకున్నయి. కొమ్మ నుంచి కొమ్మకు దుంకినయి. మీద కోతులు కింద మనుసులు. ఏకాంతాన్ని కప్పుకున్నరు. కుక్కలు రెండూ కాపలా ఉన్నయి.

పొద్దు వాలిపోయింది. మొగకోతి ఓడి గెలిచింది. ఆడకోతి గెలిచి ఓడింది. చిటారు కొమ్మమీద తాపం తాపంగా రెండూ ఒక్కటయినయి. వాలు కొమ్మ కొంత సేపు ఊగి ఆగిపోయింది. ఆడకోతి అలసటగా మగకోతి ఒడిలో ఉంది. మొగకోతి ప్రేమగా తడుముతూ పేండ్లను ఏరుతోంది.

"ఇదేం బర్ర(మచ్చ)... పెద్దగుంది.. ఎట్లయింది...?" ఈపు నిమురుతూ అన్నడు ఎంకటేశు.

"మా అవ్వ... సురుకు పెట్టింది" కరిగిపోతూ బాధగా చెప్పింది రూప. వెంకటేశు కంటతడి పెట్టుకున్నడు.

"మరి అక్కడెందుకున్నవు? రావద్దా!" ఎంకటేశు.

రూప అలకగా "నువ్వు నన్ను సంపుతనన్నవట... నేను చెడిపోయిన దాన్నన్నవట...గతిలేనిదాన్నన్నవట" అంది.

"నేనెందుకన్న. నేను తాగుపోతున్నన్నవట. మొగతనం లేదన్నవట. ఇంక తిట్టినవట" అన్నడు ఎంకటేశు.

"నేనెందుకన్న. మా అవ్వను మారేసి చూసినవట. మా నాయినను పాడుత్తనన్నవట. పట్టపగలువచ్చి గుడిసెల జొచ్చినవట... అవ్వ బిడ్డ గిత్తలలెక్కున్నరన్నవట" రూప అడిగింది.

"ఇది కత. నేను నోరే తెరువలేదు. మీ అవ్వనే కలెవడి కొట్టింది. నువ్వే మా నాయనను చూసి నవ్వినవట" చెప్పిండు.

చెట్టు మీద కోతులు మళ్ళీ గీసులాడుకుంటున్నయి. అవి కొట్టుకొని కొరుక్కుని మళ్ళీ ఒక్కటయి చల్లారినయి. మత్తుగా తెప్పరిల్లినయి.

"అవును. మీ నాయినకు ఇష్టం లేదు. ఇంకో కోడలత్తే పై కర్సు కింద కుక్కలు కోతులు ఇత్తరనుకుంటడు. నేను ఈ కోతిని గూడా తేలేనని మంట"

"మీ అవ్వకు నిన్ను ఇడువాలని లేదు. లగ్గమప్పుడు నీతో కోతిని గూడ ఇత్తనన్నది. లగ్గమయినంక కోతిని ఇయ్యనంది. ఆరు నెలలైనంక నిన్ను ఇడిపిచ్చుకుంది. నువ్వు లేకుంటే వాళ్లకు సంపాదన లేదుగదా సంపాదన లేకుంటే తాగుడు లేదు. తాగుడు లేకుంటే వళ్లిద్దరుండరు" ఎంకటేశు అన్నాడు.

చీకటి పడ్డది. సుక్కలు పొడిచినయి. చెట్టు మీద కోతులు. చెట్టు కింద మనుసులు ఒకరిలో ఒకరు ఒదిగి కూసున్నరు. ఇడిసి పోవాలని లేదు. ఏం చేయాలో తెలియదు. మాటలన్నీ పూర్తయినయి. మౌనంగా ఉన్నరు. ఒంటి మీద ఎన్నెల దుప్పటినే కప్పుకున్నరు.

"చీకటి పడ్డది" బుగులుగా అన్నది రూప.

"అవును పడ్డది" అంతే దిగులుగా అన్నడు వెంకటేశు.

"మా నాయిన వత్తే సంపనే సంపుతడు. నేను పోత"

"మా నాయినా గూడా! మంట మండుతడు. నేను గూడ పోత"

రూప కొమ్మ మీదున్న తన కోతిని లాగుతూ "యాటా కలిసి ఉండుట్ల తెలువలేదుగానీ దూరముంటే ఈ కోతి బతికెతట్టు లేదు బగ్గ సై మరిగింది" అన్నది.

"అయ్యో! దీని గోస చెప్పరాదు! మూడు రోజులాయె ముద్ద ముట్టక. వశంగాక వచ్చిన" తన కోతిని లాగుతూ ఎంకటేశు అన్నాడు. కుతి దీరినా

కోతుల తాపం తీరలేదు. బలవంతాన గానీ రాలేదు. భుజాలమీద ఎక్కినా ఒకదాన్నొకటి చూసుకుంటున్నాయి.

'నువ్వు బాగా బక్కగైనవు. తింటలెవ్వా" రూప అడిగింది.

'నువ్వు బాగా బక్కగైనవు. వాళ్ళకు సంపాయించి పెడుతున్నవు. నీకు తిండే పెట్టది పాపపు ముండ" గోసగా అన్నడు.

వలలు సదురుకొని ఇద్దరు నడుత్తున్నరు. ఎంట రెండు కుక్కలు. ఎన్నెలకు వాలుగా వాళ్ళ నడక.

"రెండు మూడు కొత్తసాములు నేర్సుకున్న. వరుసగ నాలుగు పల్టీలు గొడుత. ఎరికేనా..."రూప అన్నది మెత్తగా.

"నేను తాడు మీద నడుసుడు నేర్చిన. ఒంటి పయ్య మీద సైకిలు తొక్కుత. ఏ ఊర్లకు పోయినా ఈ రెండు జేత్తుంటే పైసలే పైసలు" అంతే మెత్తగా అన్నడు ఎంకటేశు.

కోతులు దిక్కులు సూత్తన్నయి. సూసి సూసి భుజాలు మారుతున్నయి. ఎవరి భుజాల మీద ఎవల కోతి ఉందో తెలువలేదు.

కొంత దూరం సాగినాక తొవ్వ రెండుగా విడిపోయింది. అక్కడే కాలు ఆపింది రూప. ఎంకటేశు ఆగిపోయిండు. రెండడుగులు ఎనక్కి వచ్చింది రూప. వాడు రెండడుగులు ముందుకేసిండు.

ఎన్నీల ఎలుగులో రూప ముక్కు పుల్ల ఎంకటేశు మొఖం మీద తలుక్కుమంది. ఎంకటేశు ఎండికడెం రూప నడుం మీద చమక్కుమంది. రెండుగా సాగిన నీడలు ఒక్కటయి కదులుతున్నాయి. కోతులు రెండూ కిసకిసమన్నయి. కుక్కలు రెండూ గుర్రుమన్నయి.

"నా ముక్కుపుల్ల అమ్మితే డేరా కొనొచ్చు..." మత్తుగా అంది రూప.

"నా కడెంకేం తక్కువనా... బోల్లు బోకెలు వారం గాసం వత్తది" అన్నాడు ఎంకటేశు.

"సూడక ముందు వేరు. సూశింది గదా... నా కోతి ఒంటిగ బతుకనే బతుకది" కోతి తల నిమురుతూ అన్నది రూప.

"నాదీ అంతే! జరమచ్చినట్టుండె... వారం పది రోజులనుంచి ఆటనే లేదు.. ఇప్పుడు జూడు ఎంత ఉషారుందో.."

"కోతులను ఎడబాపుడు పాపమేగదా...." మురిసిపోతూ రూప నవ్వింది. అన్నంక సిగ్గుపడ్డది.

"కాదా... నోరు లేని జీవాలు. మన కడుపే నింపుతున్నయి గదా... ఎడబాపుడెందుకు" మురిసిపోతూ ఎంకటేశు. కోతులు రెండూ మూతులు కొరుక్కున్నయి. ఆడకోతి తెగింపుతో కలవడ్డది. మొగకోతి నిలవడ్డది.

ఆమె ఒత్తుకున్నది. అతడు ఆమెను ఎత్తుకున్నడు. ఆ స్పర్శలో ఒకరికొకరు కావాలనుకునే బలమైన కోరిక ఇద్దరి గుండెల్లోనూ నిబ్బరాన్ని నింపింది. అలా ఎంత సేపయిందో తెలువది.

★ ★ ★

కూరుకు రాత్రి... డేరాలో కూసున్న బాల వచ్చిపోయేటోల్లను జాడ తీత్తే 'రెండు కోతులతో ఇద్దరు మనుసులు ఎన్నీలకు ఎదురెక్కుతున్నారని' తెలిసింది. ఎంట రెండు కుక్కలు ఉండనే ఉన్నయట.

● ఆదివారం, ఆంధ్రజ్యోతి - 27 ఆగస్టు, 2006 ●